పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఉదయమంతా ఎండ... మధ్యాహ్నమైతే వర్షం ఇలా..గత కొద్ది రోజులుగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో కొనసాగుతుంది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుతో పాటు మన్యంలోని పలు ప్రాంతాల్లో శనివారం కూడా భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. పాడేరులో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రత నెలకొంది. తరువాత ఒకసారిగా వాతావరణం మారి ఆకాశం మేఘావృతమై వర్షం మొదలైంది. 4 గంటల తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. భారీగా వర్షం కురవడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షానికి పట్టణంలోని రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి.

కురుస్తున్న వర్షం

పదిలో బాలికలదే పైచేయి

▶▶ రాష్ట్రంలో విశాఖకు మూడు, అనకాపల్లి జిల్లాకు ఐదో స్థానం, 24లో అల్లూరి సీతారామరాజు జిల్లా

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లా మూడు, అనకాపల్లి జిల్లా ఐదో స్థానంలో నిలవగా, అల్లూరి సీతారామరాజు జిల్లా 24వ స్థానంలో ఉంది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం పదో తరగతి ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో బాలికలు ముందంజలో ఉన్నారు. విశాఖపట్నం జిల్లాలో పది పరీక్షలకు హాజరైన 27,447 మందిలో 22,692 (82.68 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ప్రథమ శ్రేణిలో 18,591 మంది, ద్వితీయ శ్రేణిలో 2918 మంది, తృతీయ శ్రేణిలో 1183 మంది విద్యార్థులు పాసయ్యారు. అనకాపల్లి జిల్లాలో పరీక్షలకు హాజరైన 22,151 మందిలో 17,221 (77.74 శాతం) మంది పాసయ్యారు. వీరిలో ప్రథమ శ్రేణిలో 12,906 మంది, ద్వితీయ శ్రేణిలో 3021 మంది, తృతీయ శ్రేణిలో 1294 మంది ఉత్తీర్ణత సాధించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరీక్షలు రాసిన 10,878 మంది విద్యార్థుల్లో 6680 (61.41 శాతం) మంది పాసయ్యారు.

విశాఖ జిల్లాలో బాలురు 14,213 మంది పరీక్షలు రాయగా 11,507 మంది (80.96 శాతం), బాలికలు 13,234 మందికి 11,185 మంది (84.68 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అనకాపల్లి జిల్లాలో బాలురు 11,199 మందికి 8,320 మంది (74.29 శాతం), బాలికలు 10,952 మందికి 8901 మంది (81.27 శాతం), అల్లూరి జిల్లాలో బాలురు 5036 మందికి 3087 మంది (61.30 శాతం), బాలికలు 5842 మందికి 3593 మంది (61.50 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

అభినందిస్తున్న మల్లికార్జున

జిల్లాల వారీగా బాల, బాలికల హాజరు, ఉత్తీర్ణత, శాతం

జిల్లా		హాజరు	ఉత్తీర్ణత	శాతం
విశాఖపట్నం	బాలురు	14,213	11,507	80.96
	బాలికలు	13,234	11,185	84.52
	మొత్తం	27,447	22,692	82.68
అనకాపల్లి	బాలురు	11,199	8320	74.29
	బాలికలు	10,952	8901	81.27
	మొత్తం	22,151	17,221	77.74
అల్లూరిజిల్లా	బాలురు	5036	3087	61.30
	బాలికలు	5842	3593	61.50
	మొత్తం	10,878	6680	61.41

నిర్మాణదశలో ఉన్న అక్రమ కట్టడం

అనంతగిరిలో జోరుగా అక్రమ కట్టడం

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- అనంతగిరి

గిరిజన చట్టాలు, హక్కులను ఉల్లంఘిస్తూ రెవెన్యూ అధికారుల అండదండలతో తహసిల్దార్ కార్యాలయం సమీపాన వైఎస్ఆర్ వీధిలోని ప్రభుత్వ భూమిలో గిరిజన నేతురుడు సాయి అక్రమంగా కట్టడాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. మండల రెవిన్యూ అధికారుల అండ దండలతో పనులు జోరుగా సాగుతున్నాయి తహసిల్దార్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో గిరిజనేతరుడు అక్రమంగా ఆక్రమించుకొని పునాది నుండి శ్లాబ్ వేశాడు. డెక్కింగ్ పనులు గత మూడు రోజుల నుండి జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవిన్యూ అధికారులు పట్టించుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పనులు మరింత వేగవంతంగా జరుగుతున్నాయి. అయినప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోలేదు. స్థానిక గిరిజనులు ఇల్లు కట్టుకునేందుకు స్థలాలు కేటాయించాలని అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించినా పట్టించుకునే నాధుడే లేరని వారు వాపోయారు. గిరిజన ప్రాంతంలో అనేక చట్టాలు ఉన్నా గిరిజనేతరులకు ఏ మాత్రం పట్టించుకోలేదని పలువురు గిరిజనులు, వివిధం సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అక్రమ కట్టడం తక్షణమే కూల్చి వేయాలని పలువురు కోరుతున్నారు.

తక్షణమే నిలిపివేయాలి : సిపిఎం సర్పంచ్

తహశీల్దార్ కార్యాలయం వైెస్ఆర్ వీధిలో ప్రభుత్వ భూమిలో గిరిజన నేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తక్షణమే రెవిన్యూ అదికారులు నిలిపి వేయాలని స్థానిక సీపీఎం సర్పంచ్ సోమ్మెల రూతు డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ, మండల కేంద్రం నడి ఒడ్డున ప్రభుత్వ భూమిలో గిరిజనేతరులు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత రెవిన్యూ, సచివాలయాల సిబ్బంది చూస్తూ ఊరుకుంటున్నారన్నారు. అధికారుల అండదండలతోనే ఈ అక్రమ కట్టడాలు జోరుగా జరుగుతున్నాయని తెలిపారు. తక్షణమే పరిశీలించి నిలుపుదల చేయాలని, లేకుంటే పంచాయతీ పూర్తి బాధ్యతలతో అక్రమ కట్టడాలను కూల్చి వేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ అక్రమ కట్టడంపై స్థానిక ప్రజల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. గిరిజన హక్కులు, చట్టాలను కాపాడవలసిన అధికారులు సహకరిస్తూ అక్రమణదారులను ప్రోత్సహిస్తున్నారన్నారు.అక్రమ కట్టడాలు నిలిపివేయాలని, లేకుంటే కూల్చి వేస్తామని ఆమె స్పష్టం చేశారు.

అభివృద్ధికి నోచని అల్లూరి పార్కు

▶▶ పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ▶▶ నేడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి

శిథిలమైన షెడ్

ప్రజాశక్తి-గొలుగొండ: అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో ఉన్న అల్లూరి సమాధులు, పార్కు అభివృద్ధికి నోచకోలేదు. వీటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం శోచనీయం. అల్లూరి జయంతి వర్ధంతి సందర్భంగా భారీ సభలు ఏర్పాటు చేసి అమలుకు నోచుకోని హామీలను ప్రకటించడం తప్ప అవి ఆచరణలోకి రాక ఏ విధమైన అభివృద్ధి కూడా ఇక్కడ కానరాలేదు. ఈనెల 7న అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.. అల్లూరి సీతారామరాజు సమాధులు ఉన్న పార్క్ అభివృద్ధి విషయంలో నీలి నీడలు అలుముకున్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో శిథిల కట్టడంలో దర్శనమిస్తోంది. పార్కును సందర్శించేందుకు పర్యాటకులు కార్తిక మాసం, వేసవి సెలవుల్లో ఎక్కువగా వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని పర్యటకంగా తీర్చిదిద్దుతామని నాడు తెలుగుదేశం ప్రభుత్వం, నేడు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదు. మూడు సంవత్సరాల క్రితం మంత్రి హోదాలో వచ్చిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా నేటికీ నిధులు విడుదల కాలేదు. పార్కులో సీతారామరాజు, గంటందొర సమాదుల షెడ్లు పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు చొప్పగడ్డితో నిర్మించిన షెడ్లు శిథిలమవతున్నా పట్టించుకునే నాధుడే లేడు.

శిథిలమైన మెట్లు

ఎమ్మెల్యే, ఎంపి రాక

అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆదివారం అరకు ఎంపి గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గొలుగొండ మండలం ఏఎల్‌పురంలోని అల్లూరి పార్కుకు రానున్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆయన సమాధులకు నివాళ్ల అర్పించడానికి హాజరవుతున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి.

అల్లూరి పేరుతో నాణెం విడుదల చేయాలి

సీతారామరాజు పేరున 125 రూపే నాణెంను విడుదల చేయాలి. పార్లమెంటులో అల్లూరి విగ్రహానికి అనుమతులు ఉన్నా ఎందుకు అవకాశం కల్పించడం లేదు. ఆర్థిక పరంగా ఇబ్బందులు ఉంటే ఎన్ని లక్షలు ఖర్చయినా మా జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఖర్చుపెట్టి పార్లమెంట్‌లో విగ్రహం పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. చిత్తశుద్ధి ఉంటే తమకు అనుమతులు ఇవ్వండి.

పడాల వీరభద్రరావు,
అల్లూరి జాతీయ యువజన సంఘం అధ్యక్షులు

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు

అల్లూరి జిల్లా టాపర్‌గా మోతుగూడెం డిఎవి పబ్లిక్ స్కూల్

వేదక్షయ, సాయి కిరణ్, శంకర్

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

2022-23 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.

జోషిత్ ప్రేమ్

ప్రజాశక్తి- మోతుగూడెం

అల్లూరు సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలోని డిఎవి పబ్లిక్ స్కూల్ పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది. మొత్తం 28 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 28 మంది పాసై, అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 579 మార్కులతో వేదక్షయ ప్రథమ స్థానం, 567తో సాయి కిరణ్, శంకర్ ద్వితీయ స్థానం, 566 మార్కులతో జోషిత్ ప్రేమ్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఎపి జెన్‌కో ఉన్నతాధికారులు డిఎవి పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మందికి 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

జిల్లా టాపర్‌గా జాహ్నవి శ్రీనిధి

కూనవరం : మండలంలో 354 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 197 మంది పాసై 56 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నీలి బాలరాజు తెలిపారు. కూనవరం జెడ్‌పి పాఠశాలకు చెందిన పోసిన జాహ్నవి శ్రీనిధి 588 మార్కులు సాధించి అల్లూరి జిల్లా టాపరుగా నిలిచింది. స్థానిక జెడ్‌పిహెచ్‌లో 33 మందికి 20 మంది, మర్రిగూడెం జెడ్‌పిహెచ్‌లో 42 మందికి ఐదుగురు, నర్సింగపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో 68 మందికి 14, రేపాక బాలుర ఆశ్రమ పాఠశాలలో 21 మందికి 12, కెజిబివిలో 41 మందికి 23 మంది, కోతులగుట్ట ఎపిఆర్‌లో 87 మందికి 72 మంది, విక్టోరియా మాంటిసోరిలో 27 మందికి 21, విజయ సాధనలో 35 మందికి 30 మంది ఉత్తీర్ణులయ్యారు. విక్టోరియా మాంటిసోరి పబ్లిక్ స్కూల్ విద్యార్థి మధునై 576 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా టాపర్‌గా నిలిచిన జాహ్నవి శ్రీనిధిని ఎంఈఓ బాలరాజు, హెచ్‌ఎం చిచ్చడి బాబురావు అభినందించారు.

డిఎవిలో 100 శాతం ఉత్తీర్ణత

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాల విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం రామచంద్రరావు తెలిపారు. పాఠశాల నుంచి 19 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 19 మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. 600 మార్కులకు ఎ.గాయత్రి 551 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా షేక్ యూసఫ్ 537తో ద్వితీయ స్థానం, జి.వంశీకృష్ణ 534తో తతీయ స్థానంలో నిలిచారు. శత శాతం ఉత్తీర్ణత వెనుక ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందని అభినందించారు.

గాయత్రి

గురుకులంలో 87.3, జెడ్‌పి పాఠశాలలో 67.7 శాతం

సీలేరు ఎపి గురుకుల పాఠశాలలో టెన్త్ విద్యార్థులు 87.3 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. 63 మంది పరీక్షలు రాయిగా 55 మంది పాసయ్యారు. వల్లభనేని అనిల్ 480 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 31 మందికి 21 మంది పాసై, 67.7 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం రామన్న పడాల్ తెలిపారు. కిలో సాయికుమార్ 464 మార్కులతో ప్రథమ స్థానం, శ్రీకాకుళం హిమబిందు 459తో ద్వితీయ స్థానంలో నిలిచారు.

షేక్ యూసఫ్

బాలపద్మజ, జి.దివ్య, పవన్ కుమార్

మండలంలో 99.7 శాతం ఉత్తీర్ణత

కొయ్యూరు : టెన్త్ ఫలితాల్లో కొయ్యూరు మండలం 99.7 శాతం ఉత్తీర్ణత సాధించింది. రెండు జెడ్‌పి, ఒక గురుకులం, ఒక కెజిబివి, 14 ఆశ్రమ పాఠశాలల నుండి 994 మంది పరీక్షలు రాయగా, 992 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఇఒ బోడెంనాయుడు తెలిపారు. కొయ్యూరు జెడ్‌పి పాఠశాలకు చెందిన వి.బాల పద్మజ 550 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఎపి గురుకుల పాఠశాలకు చెందిన పవన్ కుమార్, రావణాపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన జి.దివ్య ఇద్దరూ 548 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో రావణాపల్లి పాఠశాలకు చెందిన జి.దివ్య అత్యధిక మార్కులు సాధించినట్లు ఎటిడబ్ల్యుఒ క్రాంతి కుమార్ తెలిపారు. 14 ఆశ్రమ పాఠశాలల నుండి 513 మంది పరీక్ష రాయగా, 511 మంది పాసైనట్లు వెల్లడించారు.

మండలంలో 59 శాతం ఉత్తీర్ణత

అడ్డతీగల : 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో అడ్డతీగల మండలం 59 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ మల్లేశ్వరరావు తెలిపారు. మండల మొత్తంగా 367 మంది పరీక్షలకు హాజరు కాగా 218 మంది ఉత్తీర్ణత సాధించారని, 149 మంది ఫెయిలయ్యారని పేర్కొన్నారు. వెదురునగరం జివికె స్కూల్ చెందిన జర్తా మౌనిక (550) మార్కులతో మండలం టాపర్‌గా నిలవగా, ఏపీఆర్ గురుకుల పాఠశాలకు చెందిన జగు రాజుకుమార్ (549) ద్వితీయ స్థానంలో నిలిచారు. వారిద్దరికి ఎంఈఓ మల్లేశ్వరరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వెదురు నగరం స్కూల్లో 20 మంది పరీక్షకు హాజరుకాగా 20 మంది పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాలలో 75 మందికి 55 మంది, రాయపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆరుగురికి ముగ్గురు, ఎల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో 23 మందికి 16 మంది, అడ్డతీగల ఆశ్రమ పాఠశాలలో 24 మందికి 16 మంది, వీరవరం ఆశ్రమ పాఠశాలలో 11 మందికి ఐదుగురు, డి.భీమవరం ఆశ్రమ పాఠశాలలో 39 మందికి 26 మంది, అడ్డతీగల జెడ్పీ హైస్కూల్‌లో 64 మందికి 35 మంది, గొంటువానిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 39 మందికి 20 మంది, అడ్డతీగల ఆశ్రమ పాఠశాల బాలికల పాఠశాలలో 66 మందికి 25 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఓ మల్లేశ్వరరావు తెలిపారు.

జర్తా మౌనిక

రాజుకుమార్

మండలంలో 70 శాతం ఉత్తీర్ణత

ఎటపాక : పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండలంలో 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 2 ఆశ్రమ పాఠశాలలు, కేజిబివి, ఒక ప్రైవేట్ పాఠశాల నుండి మొత్తం 255 మంది హాజరుకాగా, 177 మంది ఉత్తీర్ణులయ్యారు. నందిగామ ఉన్నత పాఠశాలలో 21 మందికి 13 మంది, నెల్లిపాక ఉన్నత పాఠశాలలో 33 మందికి 21 మంది, సీతాపురం ఉన్నత పాఠశాలలో 24 మందికి 14 మంది, గౌరిదేవిపేట ఉన్నత పాఠశాలలో 18మందికి 10 మంది, పినపల్లి ఉన్నత పాఠశాలలో 24 మందికి 18 మంది, గొల్లగూడెం ఉన్నత పాఠశాలలో 16 మందికి 10 మంది, కెఎన్ పురం ఆశ్రమ పాఠశాలలో 40 మందికి 32 మంది, నల్లకుంట ఆశ్రమ పాఠశాలలో 26 మందికి 16 మంది, కేజిబివిలో 37 నుండి 27 మంది, శ్రీఆదిత్య స్కూల్‌లో 16 మందికి 16 మంది ఉత్తీర్ణత సాధించారు. నెల్లిపాక ఉన్నత పాఠశాలకు చెందిన పి.సాయి శంతన్ 563 మార్కులతో ప్రథమ స్థానంలోనూ పి.వివేక్ 536తో ద్వితీయ స్థానంలో నిలిచారు.

95 శాతం ఉత్తీర్ణత

రంపచోడవరం : పదవ తరగతి ఫలితాలలో రంపచోడవరం మండలంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించి అగ్రస్థానంలో నిలిచినట్లు ఎంఇఒ కె సత్యనారాయణ దొర తెలిపారు. మండలంలో 16 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. కె.ఎర్రంపాలెం ఆశ్రమ పాఠశాల నుంచి 21 మంది పరీక్షలకు హాజరుకాగా 14 మంది ప్రథమ శ్రేణి, ఆరుగురు ద్వితీయ శ్రేణిలో పాసయ్యారు. కోసు బుచ్చరాజ్యం 527 మార్కులు సాధించింది. రంపచోడవరం ప్రభుత్వ పాఠశాలకు చెందిన మన్నె సుబ్బలక్ష్మి 565 మార్కులు, నవదీప్ 547 మార్కులు సాధించినట్లు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం అందాల రామారావు తెలిపారు.

మన్నె సుబ్బలక్ష్మి

మండల టాపర్‌గా చరణ్ తేజ్

రాజవొమ్మంగి : మండలంలో 471 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 327 మంది ఉత్తీర్ణులై 70 శాతం పాసైనట్లు ఎంఈఓ కె.తాతబ్బాయిదొర తెలిపారు. రాజవొమ్మంగి జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన మిరియాల చరణ్ తేజ్ 565 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, జడ్డంగి జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన కొండేపూడి నాగ చక్రధర్ 529తో ద్వితీయ స్థానం, ఎపి గురుకుల బాలికల పాఠశాలకు చెందిన కోసూరి విష్ణు దుర్గాదేవి 522తో తృతీయ స్థానం సాధించారు. రాజవొమ్మంగి జెడ్‌పి స్కూల్‌లో 124 మందికి 57 మంది, లాగరాయి జెడ్‌పి స్కూల్‌లో 14 మందికి 10, జడ్డంగి జెడ్‌పి స్కూల్‌లో 30 మందికి 27, స్థానిక ఏపీ గురుకుల పాఠశాలలో 81 మందికి 68, బోర్నగూడెం ఆశ్రమ పాఠశాలలో 60 మందికి 47, అమీనాబాద్ ఆశ్రమ పాఠశాలలో 28 మందికి 26, జడ్డంగి ఆశ్రమ పాఠశాలలో 20 మందికి 20, సింగంపల్లి ఆశ్రమ పాఠశాల నందు 40 మందికి 39 మంది, రాజవొమ్మంగి బాలికల ఆశ్రమ పాఠశాలలో 18 మందికి 7, రాజవొమ్మంగి బాలుర ఆశ్రమ పాఠశాలలో 48 మందికి 26 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ తెలిపారు.

చరణ్ తేజ్

మండల టాపర్‌గా హన్సిక

చింతూరు : చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొడే హన్సిక టెన్త్ ఫలితాల్లో 545 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. సీసం జ్యోతిర్మయి 541 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది.

హన్సిక

అనంతగిరి: మండలంలోని పదో తరగతి పరీక్ష ఫలితాలలో 14 పాఠశాల విద్యార్థులు 686 మంది పరీక్షలలో పాల్గొనగా 632 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల విద్యాశాఖ సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తేవాలని కోరారు

అరకులోయ: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఈ ఏడాది అరకులోయ మండలంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. మండలంలో 14 స్కూళ్లకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలు రాయగా, వీటిలో ఏపీటీడబ్ల్యూ ఆర్ఎస్ అరకులోయ (జి)మొత్తం86 మంది పరీక్షలు రాయగా 80 మంది ఉత్తీర్ణత సాధించారు.ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్(పిటిజి బాయ్స్) 76 మందికి 56, ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్(స్పోర్ట్స్)29 మందికి 27 మంది, కేజీబీవీ(ఎండపల్లి వలస) 33 మందికి 19 మంది, గవర్నమెంట్ హైస్కూల్ (కంటబంస్ గూడా) 56 మందికి 16 మంది, జిటి డబ్ల్యూ ఏఎస్ (బాయ్స్ కంట బౌన్స్ గూడ) 103 మందికి 28 మంది, జిటీడబ్ల్యూ ఏఎస్ కొత్త భల్లు గూడ (జి)117 మందికి 27 మంది, జిటీడబ్ల్యూఏఎస్ అరకులోయ (జి) 83 మందికి 41 మంది, జిటీ డబ్ల్యూ ఏఎస్ (బాయ్స్ రవల్లగూడ) 59 మందికి 14 మంది, జిటీడబ్ల్యూ ఏఎస్ గన్నెల(జి)64 మందికి 6, జి టీ డబ్ల్యూ ఏఎస్ (బాయ్స్ లోతేరు)24 మందికి 6, జిటీ డబ్ల్యూ ఏఎస్ బాస్కి (బాయ్స్) 31 మందికి 1, బివి కే హై స్కూల్ 11 మందికి 11, శారదా నికేతన్ 12 మందికి 11 మంది చొప్పున ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బివికె హైస్కూల్ శతశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ఈ పాఠశాలలోని పి.యామిని 564 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. ఏపీటీడబ్ల్యూ ఆర్ఎస్(జి) పాఠశాలకు చెందిన ఎం.దీప్తి 528 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. అరకులోయ మండలంలో గత ఏడాది నుంచి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గణనీయంగా ఉత్తీర్ణత శాతం పడిపోతుండడం గమనార్హం.

హర్షిత, భావన, సృజన

విద్యార్థుల ప్రభంజనమిలా..

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని శ్రీ మోదబాంబ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాల విద్యార్థినిలు వుడా సృజని 574, కిముడు బేబీ వెంకట హర్షిత 572, పాంగి భావన శ్రీ 566 మార్కులు సాధించారు. వీరితో పాటు పాఠశాలలోని 15 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించగా, మిగతా విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో పాసయ్యారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు అభినందించారు.

టెన్త్ టాపర్స్‌కు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-కొయ్యూరు

10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు లోకుల గాంధీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌ను అందజేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లోకుల రమేష్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ స్కాలర్ షిప్‌కు దరఖాస్తు అరుకు, పాడేరు నియోజక వర్గాలలో ఉన్న 11 మండలాల్లో ప్రతి మండల నుంచి అధిక మార్కులు సాధించిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9491907677, 8106450108 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్టు జనరల్ సెక్రటరీ మఠం మురళి కృష్ణ, గౌరవాధ్యక్షులు లోకుల కిరణ్, సభ్యులు అచ్యుత్ వాణి పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న లోకుల గాంధీ ట్రస్టు సభ్యులు

గృహ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి :నక్కపల్లి లో జగనన్న లే అవుట్ లో హౌసింగ్ డే సందర్భంగా గృహ నిర్మాణ పనులను శనివారం ఎంపీడీవో సీతారామరాజు, అధికారులు పరిశీలించారు. గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రారంభించిన గహాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు పేమెంట్ మంజూరు విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజు, ఎంఈఓ డివిడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, ఉపాధి పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని, ప్రతి కుటుంబానికి 200రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రోజుకి రూ.500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రూపుకి టెంట్ హౌస్, మెడికల్ కిట్టు, మజ్జిగ ఇవ్వాలన్నారు. 15 రోజులకు ఒకసారి పేమెంట్ ఇచ్చి, ప్రతి సభ్యుడికి పేస్లిప్ ఇవ్వాలన్నారు. పెండింగ్లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు బాలరాజు పాల్గొన్నారు

గృహ హక్కు పత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:సంపూర్ణ గృహ హక్కు పథకం కోసం ఓటిఎస్ చెల్లించిన లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేయాలని మండల ప్రత్యేక అధికారి అరుణ శ్రీ తెలిపారు. శనివారం ఆమె మండల సమావేశం మందిరంలో కార్యదర్శులు, సచివాలయం ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటిఎస్ చెల్లించిన వారికి హక్కు పత్రాలు అందజేయడంతో పాటు, ఎస్‌టిజి సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం, తాగునీటి పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి అప్పారావు మాట్లాడుతూ, నాడు నేడు పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సచివాలయం ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరావు, పిఓపిఆర్డి ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.

వివాదాలకు తావు లేకుండా సర్వే

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో చేపడుతున్న మలి విడత సమగ్ర భూ సర్వేలో వివాదాలకు తావు లేకుండా చేయాలని తహశీల్దారు జానకమ్మ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆమె శనివారం మాట్లాడుతూ, రైతులతో మమేకమై సర్వే నిర్వహించాలన్నారు. మండలంలో చేపడుతున్న మలి విడత సర్వే గ్రామాలైన బి కె పల్లి, కోటవురట్ల, తంగేడు, లింగాపురం, చౌడువాడ గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్నామన్నారు.ఇంతవరకు సర్వే పూర్తయిన గ్రామాలకు భూహక్కు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో హంస దేవి, విలేజ్ సర్వేయర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల:కానరాని నాడు నేడు పనులు పేరుతో మండలంలో అల్లుముయ్యపాలెం గ్రామంలో మండల పరిషత్ పాఠశాల పై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి అప్పారావు, పలువురు అధికారులు గ్రామంలో పర్యటించి శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

బలిఘట్టంలో అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలోని బలిఘట్టంలో జరిగిన గొడవలకు సంబంధించి నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి డిఎస్పి కే ప్రవీణ్ కుమార్ శనివారం విచారణ చేపట్టారు. మున్సిపాలిటీలోని బలిఘట్టంలో ఈనెల మూడు, నాలుగు తేదీల్లో జరిగిన మరిడిమాంబ ఉత్సవంలో పెద్ద జాగారంలో గొడవలకు సంబంధించి రెండు కేసులను పట్టణ పోలీసులు నమోదు చేశారు. శనివారం బలిఘట్టం ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన విచారణలో ఆరుగురు బాధితులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి సమగ్ర సమాచారాన్ని డి.ఎస్.పి ప్రవీణ్ కుమార్ సేకరించారు. విచారణ కొనసాగుతుందని డిఎస్పి ప్రవీణ్ కుమార్ విలేకరులకు వెల్లడించారు. కాగా బాధితులకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు చైతన్య, నేతల నాగేశ్వరరావు, అల్లంపల్లి ఈశ్వరరావు పోలీసు అధికారులను కోరారు. డీఎస్పీ వెంట పట్టణ సీఐ నమ్మి గణేష్, ఎస్సై జి గోవిందరావు ఉన్నారు.

మాట్లాడుతున్న పులి సంతోష్ కుమార్

ఆదివాసీ జెఎసితో గిరిజన సంఘానికి సంబంధం లేదు

ప్రజాశక్తి-చింతూరు

ఏజెన్సీలోని ఆదివాసీ జెఏసితో గిరిజన సంఘానికి ఎటువంటి సంబంధం లేదని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ తెలిపారు. చింతూరులో శనివారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతూరు మండలం కుమ్మూరులో జరిగిన చింతూరు డివిజన్ స్థాయి ఆదివాసీ జెఏసి సమావేశంలో జెఏసి కార్యక్రమాలకు సంబంధించి జరిగిన చర్చలో ఎఎస్‌పి జాతీయ, రాష్ట్ర నాయకులు ఏకపక్ష నిర్ణయాలు చేసి వాటికి అనుగుణంగా అన్నీ సంఘాలు పని చేయాలని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. గిరిజన సంఘం, ఇతర ప్రజాసంఘాలు భిన్నాభిప్రాయాలు తెలియజేసినట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో జిఓ నెంబర్ 3 సాధనకు, 52 జిఓ రద్దుకు కలిసొచ్చే సంఘాలతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కాకా అర్జున్, సీసం సురేష్, కుంజ సీతారామయ్య, పూనెం ప్రదీప్ కుమార్, బాబు బొర్రయ్య, వేక రాజ్ కుమార్, తెల్లం తమ్మయ్య, సోంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల పేరుతో బెదిరింపులు సరికాదు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో పాత్రికేయులం అని చెబుతూ కొంతమంది ఆధార్ సెంటర్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడటం సరికాదని ఆధార్ సేవల రంపచోడవరం డివిజనల్ కోఆర్డినేటర్ బి.డేవిడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కేంద్రాలకు వెళ్లి లైసెన్స్ ఉందా? ఆధార్ సెంటర్ ఎవరు మంజూరు చేశారంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. అటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం నుండి ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లు సక్రమంగా నిర్వహించేందుకు పాత్రికేయులు సహకరించాలని ఆయన కోరారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. గత ఏడాది లాభాల్లో నడిచిన కర్మాగారానికి ఈ ఏడాది ఆశించిన మేర లాభాలు రాకపోవడానికి కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరుస్తూ తీసుకున్న చర్యలే కారణమని తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 765వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంఘం మద్దిలపాలెం జోన్ నాయకులు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం సొంత గనులు కేటాయించాలన్నారు. దీంతోపాటు తక్షణ సాయంగా రూ.5 వేల కోట్లు కేటాయిస్తే ప్లాంట్‌కు ఊతమిచ్చిన వారవుతారన్నారు.

నేడు విశాఖలో అల్లూరి శత వర్ధంతి సభ

- హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో విఫలం

మాజీ మంత్రి శ్రావణ్ కుమార్

మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి- పెదబయలు రూరల్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. పెదకోడపల్లి పంచాయతీలో శనివారం ర్యాలీ చేశారు. స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలని, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షురాలు సుకుమారి అధ్యక్షన జరిగిన సమావేశంలో శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి నిరుద్యోగులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల పార్టీ అధ్యక్షురాలు సీకరి సుకుమారి, ప్రధాన కార్యదర్శి పాంగి నాగేశ్వరరావు, కూడా భూషణరావు, సల్లంగి రవికుమార్, బకూరు సర్పంచ్ బకూరు వెంకటరమణ రాజు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, కొర్ర బాబురావు, కిముడు మహేశ్వరీ, ఉల్లి సింహాచలం, కటారి బలంనాయుడు, సీకరి వెంకటేష్, అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఈనెల 8 నుండి జూన్ 11 వరకూ నిర్వహించనున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి జనార్ధన్ కోరారు. శనివారం ఆయన వేసవి శిక్షణ తరగతులపై గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కరపత్రాలను పంపిణీ చేశారు.గ్రంథాలయంలో ప్రతీరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరకూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.విద్యార్థులతో కథలు చెప్పించడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు వంటి వాటితో పాటు చిత్రలేఖనం, పేపరు క్రాఫ్ట్ వంటి వివిధ అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కె.రంగబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుండి వేసవి విజ్ఞాన బడి నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ పి. దమయంతి తెలిపారు. ఈ మేరకు కరపత్రాలు, పోస్టర్స్, బ్యానర్ లను విశ్రాంత గ్రంథాలయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విజ్ఞాన బడికి 10నుండి 15 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులను పంపించాలని, ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటిం, పేపర్ క్రాఫ్ట్, డాన్స్, డ్రామాలను ఉచితంగా నేర్పిస్తామని తెలిపారు.

పాయకరావుపేట:స్థానిక వైయస్ రాజశేఖర్ రెడ్డి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరము ఈనెల 8 నుంచి 11 వరకు సమ్మరు క్లాసులు జరుగుతాయని ఇన్చార్జి గ్రంథాలయ అధికారి వామాల శ్రీనివాసరావు శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. సమ్మర్ క్లాస్‌ల గోడపత్రికలు విడుదల చేశారు. గ్రంథాలయం లో పుస్తకాలు చదవడం, పుస్తకాలపై సమీక్షకథలు చెప్పడం, పెయింటింగ్‌పై శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

కోటవురట్ల:గ్రంథాలయాలలో ఈ నెల 8 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్, మండల విద్యాశాఖ అధికారి అప్పారావు కోరారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక శాఖ గ్రంథాలయంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టే విధంగా జిల్లా గ్రంథాలయ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమ్మర్ క్యాంపెయిన్‌లో భాగంగా లింగాపురం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నరసింగరావు, గొల్లపేట ప్రధానోపాధ్యాయులు జీవన్‌రావులు విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి దృష్ట్యా చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

గొలుగొండ:గొలుగొండ శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8 నుండి జూన్ 11 వరకు జరుగు వేసవి విజ్ఞాన శిబిరం బ్రోచర్లను గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో తహశీల్దార్ ఆనందరావు, ఎంపిడిఒ డేవిడ్‌రాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను శనివారం ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈఓ డివిడి ప్రసాద్ పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపల్ శైలజ ఆధ్వర్యంలో ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈనెల 1 నుండి ఉదయం 8 నుండి 1 గంట వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. మంచి ఫలితాలు సాధనకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

గొలుగొండ:ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఏఎల్‌పురం జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఎంపిడిఒ డేవిడ్‌రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

నిరంతరాయ విద్యుత్ ఇపిడిసిఎల్ లక్ష్యం

సంస్థ సిఎమ్‌డి పృథ్వీతేజ్

మాట్లాడుతున్న పృథ్వీ తేజ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ సంస్థ అధికారులను ఆదేశించారు. విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆయన సంస్థ పరిధిలోని ఐదు సర్కిళ్లకు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలను అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపరుచుకునేందుకు ప్రణాళికా బద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఫీడర్ వారీగా విద్యుత్ అంతరాయాలను సమీక్షించి వాటిని తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులకు నిర్దేశిత ప్రామాణిక సమయంలో సేవలందించడంలో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వినియోగదారుల సమస్యలకు సంబంధించి సర్కిల్, డివిజన్ స్థాయిలో తరచూ సమీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు విద్యుత్ భద్రత అంశాలపై ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. లైన్‌మ్యాన్లు, ఎనర్జీ అసిస్టెంట్లు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా కొంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమైన విషయమన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ పొదుపు అంశాలపై వినియోగదారులకు కూడా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని, వినియోగదారులు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని అన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎవివి.సూర్య ప్రతాప్, చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, అచ్చి రవికుమార్, ఒ.సింహాద్రి, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, ఎస్.మసిలామణి, ఎం.రామకృష్ణ, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.రవీంద్ర, జనరల్ మేనేజర్లు, ఐదు సర్కిళ్ల ఎస్ఇలు, ఇఇలు పాల్గొన్నారు.

ఎల్‌జి పాలిమర్స్ మృతులకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మూడేళ్ల క్రితం ఎల్‌జి.పాలిమర్స్ దుర్ఘటనలో మృతిచెందిన వారికి సిఐటియు విశాఖ జిల్లా కమిటీ శ్రద్ధాంజలి ఘటించింది. పాలిమర్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆరోగ్య రక్షణ కల్పించాలని సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం మద్దిలపాలెం ఆర్‌టిసి బస్‌స్టాండ్ వద్ద సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రమాద మృతుల స్థూపం ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగి నేటికి మూడేళ్లు అవుతున్నా బాధితులకు నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాదం జరిగిన వెంటనే ఆఘమేఘాలమీద విశాఖపట్నానికి వచ్చి ఎయిర్‌పోర్టులోనే చనిపోయిన బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ప్రకటించి వెళ్లిపోయారన్నారు. ప్రమాదంలో గాయపడ్డ ముగ్గురు వారం రోజులలోపే చనిపోతే ఆ కుటుంబాలకు నేటికీ నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఎల్‌జి పాలిమర్స్‌ను ఆ ప్రాంతం నుంచి తొలగించాలని బాధితులంతా డిమాండ్ చేసినా రాష్ట్ర ప్రభుత్వం మల్టీ ఇంటర్నేషనల్ కంపెనీ యాజమాన్యానికి అమ్ముడుపోయి తూతూ మంత్రపు చర్యలు చేపట్టిందన్నారు. ఆర్‌ఆర్ వెంకటాపురంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌పిసిఎల్ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేస్తున్న ప్రచారంలో ప్రజలు భాగస్వాములు కావాలని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ డిజిఎం సేల్స్ సి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. సాక్షం - 2023 పేరుతో 'నెట్ జీరో' ఎనర్జీ కన్జర్వేషన్‌పై అవగాహన కల్పించేందుకుగాను శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందన వనరుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో డిజిఎంలు ఎ.సుందర వదన్, కిరణ్ కుమార్, సీనియర్ ఏరియా సేల్స్ మేనేజర్ వి.పవన్ కుమార్, హెచ్‌పిసిఎల్ సిబ్బంది, హెచ్‌పి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, డెలివరీ బాయ్స్, హెచ్‌పి పెట్రోల్ బంక్ సిఎస్‌ఎ సిబ్బంది పాల్గొన్నారు.

లింగంపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:లింగంపేట గ్రామ సచివాలయంలో కేడిపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎన్.హరిప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బిపి, సుగర్‌తో పాటు గర్భిణీలకు, కిశోర్ బాలికలకు రక్తహీనత పరీక్షలు, క్యాన్సర్, టిబిలకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.జయకృష్ణ, ఎ.ఉమాదేవి, బి.ఐశ్వర్య, ఆశ వర్కర్లు జి.అచ్చితల్లి, ఎన్.మంగతల్లి, డి.మల్లేశ్వమ్మ, వి.కొండతల్లి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆరిలోవ : రేషన్ డిపోలో అనధికారికంగా నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఆరిలోవ కాలనీ 358 డిపోను శనివారం విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు తనిఖీ చేశారు. అదనంగా సుమారు 700 కిలోల బియ్యం ఉన్నట్టు గుర్తించి సీజ్ చేసి, డిపో నిర్వాహకునిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిఐ కోటేశ్వరరావు, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారిగా కిశోర్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారిగా ఎస్.కిశోర్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నెల్లూరు జైళ్ళ శాఖ ట్రైనింగ్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించిన కిశోర్‌కుమార్ ప్రమోషన్‌పై విశాఖ వచ్చారు. బాధ్యతలు చేపట్టిన కిశోర్‌కుమార్‌కు కేంద్రకారాగారం అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి నరసింహం తెలిపారు. దీనికోసం అడవివరం ప్రాంతంలోని పాఠశాలలకు ఆహ్వాన పత్రాలను పంపినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరానికి సంబంధించిన పోస్టర్లను శనివారం విడుదల చేశారు.

51వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 51వ వార్డు పరిధి మాధవధార, కళింగనగర్, వుడాకాలనీ క్వార్టర్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ రేయ్యి వెంకటరమణతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, డైరెక్టర్ పైడి శ్రీను, రమేష్, రాయుడు శ్రీను, నూకరాజు, తిరుమలరావు, పైడి ప్రతాప్, రత్నం, దమయంతి, వై.వరలక్ష్మి, రాణి, శ్యామ్, గణేష్, బి.రాజేశ్వరరావు, మైలపల్లి శ్రీను, జి.రామమోహన్ రావు, ఎం. సునీల్ పాల్గొన్నారు.

'బాలినేని వియ్యంకుని అక్రమాలపై విచారించాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కొండ భాస్కర్‌రెడ్డిపై విచారణ చేయించి అక్రమ ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసినట్లు నిరూపిస్తానని, నిరూపించలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని చెప్పారు.

హుదూద్ బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -గోపాలపట్నం : హుదూద్ తుపాన్ సమయంలో సర్వం కోల్పోయిన నిరుపేదలకు తక్షణమే ఇళ్లు మంజూరుచేయాలని సిపిఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి బలివాడ వెంకటరావు డిమాండ్ చేశారు. హుదూద్ తుపాన్ బాధితుల ఆధ్వర్యాన గోపాలపట్నంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2014లో తెలుగుదేశం ప్రభుత్వం లబ్ధిదారులను గుర్తించి కొమ్మాది సర్వేనెంబర్ 83లో జి ప్లస్ త్రీ పద్ధతిలో ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. ఎనిమిదేళ్లు గడిచినా ఇంకా అవి నిర్మాణ దశలోనే ఉన్నాయని ఎద్దేవాచేశారు. ఇప్పటికే లబ్ధిదారులందరూ రూ.10 వేలు చొప్పున డీడీలు చెల్లించారని తెలిపారు. రాజకీయాలతో జగన్ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. దీనిపై వ్యక్తిగతంగా దరఖాస్తులను కలెక్టర్‌కు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీన గోపాలపట్నం సిఐటియు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులు ఇచ్చేందుకు లబ్ధిదారులందరూ రావాలని కోరారు.

భారీ వృక్షాన్ని తొలగిస్తున్న కుండాడ యువకులు

రహదారికి అడ్డంగా భారీ వృక్షం

ప్రజాశక్తి - మారేడుమిల్లి

మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో రహదారులకు అడ్డంగా పెద్ద పెద్ద చెట్లు నేలకొరిగాయి. అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరకు అంతరాయం ఏర్పడింది. శనివారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురిసిన గాలివానకు మండలంలోని కుండాడ పంచాయతీ పరిధిలోని జిఎం వలస జంక్షన్ నుండి మారేడుమిల్లి వెళ్ళు ప్రధాన రహదారిలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. దీంతో వాహనాలు రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి కుండాడ యువత సహాయంతో భారీ వృక్షాన్ని తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

పరీక్షిస్తున్న వైద్యులు

కీళ్ల వ్యాధుల వైద్య శిబిరం

ప్రజాశక్తి-కూనవరం : శ్రీసాయి ప్రశాంతి డిగ్రీ కళాశాలలో ప్రముఖ కీళ్ల వ్యాధి నిపుణులు డాక్టర్ దత్త కుమార్ శనివారం కీళ్ల వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తనకు తోచిన సాయం చేయాలనే సంకల్పంతో హైదరాబాదు నుండి మారుమూల గిరిజన ప్రాంతం టేకులబోరు వచ్చి వైద్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కీళ్ల వ్యాధులకు గురవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు పట్టణ ప్రాంతాలలో వైద్యానికి వచ్చి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ఉచితంగా కీళ్ల వ్యాధుల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరంలో దాదాపు 80 మందిపైగా కీళ్ల వ్యాధి గ్రస్తులను ఉచితంగా పరీక్షించి, కీళ్ల వ్యాధిపై అవగాహన కల్పించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీగిరి ఈశ్వర్, ప్రసాద్, కౌస్తుభ్ పాల్గొన్నారు.

తామరపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని తామరపల్లి గ్రామంలో కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో 10 రోజులుగా లోఓల్టేజ్ వలన ప్రజలు నీటి కోసం చాలా ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులకు తెలియజేయడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ కుంజం వంశీ తెలిపారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌పార్మర్ తీసుకురావడానికి కృషి చేసిన ఎంపీపీ బందం శ్రీదేవికి గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ సారధి చిరంజీవి, గ్రామ పెద్దలు కంగల వెంకన్న, కుంజం పండు, లైన్‌మెన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.